ఆర్బీకేల్లో ఎరువులు ఎక్కడ..?

- దిక్కుతోచని స్థితిలో రైతులు
- గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభంలోనే అందుబాటులో ఎరువులు
- ఈ ఏడాది సరఫరా జరిగే పరిస్థితి కనబడటం లేదు
- ప్రైవేటు దుకాణాల వైపు చూస్తున్న రైతాంగం


వణుకూరు రైతుభరోసా కేంద్రం

పెనమలూరు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల జాడ కనబడటం లేదు. రైతులు దిక్కుతోచక ప్రైవేటు ఎరువుల దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు. రైతుభరోసా కేంద్రాలకు ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తుందో లేదో కూడా సమాచారం లేక అధికారులు, రైతులు అయోమయంలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల అవసరాలు గుర్తించి విత్తనం నుంచి విక్రయం వరకు ఉపయోగపడే విధంగా రైతుభరోసా కేంద్రాలు అమలులోకి తీసుకువచ్చింది. మండల పరిధిలో గ్రామానికి ఒకటి చొప్పున 10 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి ఉత్తమ సేవలు రైతులకు అందాయి. రైతులు విత్తనాల నుంచి పంట విక్రయం వరకు ఆర్బీకేలు పని చేశాయి.

గతంలో ప్రశంసల జల్లు..

రైతుభరోసా కేంద్రాలు అందించిన సేవలకు దేశ, విదేశాల్లో సైతం ప్రశంసలు వచ్చాయి. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, వివిధ దేశాల నుంచి వ్యవసాయ నిపుణులు, విదేశీ ప్రతినిధులు, దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు ఇలా అనేక మంది ఆర్బీకేలకు వచ్చి రైతులకు అందుతున్న సేవలను ప్రశంసించారు. వణుకూరు రైతు భరోసా కేంద్రానికి ఐఎస్‌వో గుర్తింపుతో పాటు అంతర్జాతీయంగా కూడా మంచి గుర్తింపు లభించింది.

మండల పరిధిలో గత ప్రభుత్వ పాలనలో ఆర్బీకేల ద్వారా అందిన ఎరువుల వివరాలు ఇలా ఉన్నాయి. మెట్రిక్ టన్నుల్లో.. సంవత్సరం	డీఏపీ	యూరియా	సూపర్	కాంప్లెక్స్	పొటాష్
2020-21	--	105.61	--	35	--
2021-22	45	221.89	--	90	20
2022-23	60	233.41	10	40	20
2023-24	40	374.26	--	95	5

టీడీపీ పాలనలో ప్రశ్నార్థకం..

కాగా టీడీపీ దాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్బీకేల పరిస్థితి నేడు ప్రశ్నార్థకంగా మారింది. రైతులకు సకాలంలో విత్తనాలు అందలేదు. ఇప్పుడు నాట్లు పడిన తర్వాత ఎరువుల ఊసే లేకుండా పోయింది. ప్రతీ ఏడాది వ్యవసాయ సీజన్ ప్రారంభమవ్వగానే ఆర్బీకేల్లో ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మండల పరిధిలో 2019 నుంచి 2024 వరకు డీఏపీ 85 మెట్రిక్ టన్నులు, యూరియా 705, కాంప్లెక్స్ 220, పొటాష్ 25 మెట్రిక్ టన్నుల చొప్పున రైతులకు అందింది. అయితే ఈ ఏడాది ఎరువులు ఆర్బీకేల్లో లేకపోవడంతో ప్రైవేటు ఎరువుల దుకాణాలపై రైతులు ఆధారపడ్డారు. పెనమలూరు సొసైటీలో(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) వివాదాల కారణంగా దాని నుంచి రైతులకు ఎటువంటి సేవలు అందడం లేదు.

ఇప్పటివరకు ఇండెంట్ లేదు..

ఆర్బీకేల్లో ఎరువులకు సంబంధించి అధికారులు ఇప్పటివరకు ఎటువంటి ఇండెంట్ పెట్టలేదు. గతంలో మార్క్‌ఫెడ్ నుంచి ఎరువుల సరఫరా జరిగేవి. అయితే ఈ ఏడాది ఎరువుల సరఫరా జరిగే పరిస్థితి కనబడటం లేదు. అధికారుల లెక్కల ప్రకారం యూరియా, పొటాష్, కాంప్లెక్స్, డీఏపీ 200 మెట్రిక్ టన్నులు అత్యవసరంగా రైతులకు కావల్సిఉంది. నాట్లు జరిగి చాలా రోజులు కావడంతో పంటకు ఎరువులు అవసరం. ఈ సీజన్‌లో మండలానికి 800 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుంచి స్పందన నిల్. దీంతో రైతులు అయోమయంలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల సబ్‌స్టేషన్ నిర్వహణ, 11కేవీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు పెద ఓగిరాల, ఆకునూరు, చిన ఓగిరాల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలను విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సిరివాడ, తిప్పనగుంట, ఆరుగొలను, ఓగిరాల, కానుమోలు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వచ్చేనెల 3వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ. సత్యకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఆధార్ ప్రత్యేక డ్రైవ్



కంకిపాడు: ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. మండలంలోని పునాదిపాడు సచివాలయం, చైతన్య కళాశాల, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల, నెప్పల్లి సచివాలయాల్లో శుక్రవారం ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 77 మంది ఆధార్ నమోదు చేయించుకున్నారు. శిబిరాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ పరిశీలించారు. ఆధార్ నమోదు, సవరణలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ



కంకిపాడు: దాతల సేవలను సద్వినియోగం చేసుకుని ప్రగతి సాధించాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు మోడల్ స్కూల్‌లో దాత కిలారు నాగ శ్రావణ్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన స్కూల్ డైరీలను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో దాతల పాత్ర అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఉపసర్పంచ్ కిలారు శ్రీను, ఉపాధ్యాయులు పి.రూపవాణి, మండవ శ్రీనివాస్, మీనా కుమారి పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకూలిన భారీ వృక్షం




గన్నవరం: గత కొద్ది రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపం సొసైటీ పేటలోని రోడ్డులో భారీ వేపచెట్టు శుక్రవారం నేలకూలింది. దీంతో రాకపోకలు స్తంభించడంతోపాటు విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరా మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించి విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రామవరప్పాడు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన గురువారం ఎనికేపాడులో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ చుట్టుగుంటకు చెందిన సయ్యద్ అన్వర్ జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, నలుగురు కుమార్తెలు. గురువారం మధ్యాహ్నం ఎనికేపాడులోని బీవీ రావు కల్యాణ మండపంలో జరిగే శుభకార్యానికి ద్విచక్రవాహనంపై అన్వర్, తన భార్య ఫాతిమా, కుమార్తె అఫ్రా పరహత్‌తో కలిసి బయలుదేరాడు. ఎనికేపాడు డీ మార్ట్ సమీపంలోకి వచ్చే సరికి జాతీయ రహదారిపై ఉన్న పెద్ద గొయ్యిలో వాహన చక్రం దిగబడింది. ఈ కుదుపులో ఫాతిమా అదుపు తప్పి జాతీయ రహదారిపై పడింది. అదే సమయంలో వెనుక విజయవాడ నుంచి గన్నవరం వస్తున్న ఆర్టీసీ బస్సు ఫాతిమాపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవ్వడంతో దగ్గరలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతులంతా సమష్టి కృషితో..



కంకిపాడు: ఏళ్లు గడిచిపోతున్నా డ్యాం మరమ్మతులు జరగటం లేదు. దీంతో రైతులే కలిసికట్టుగా డ్యాం బాగు చేసుకొని ఎగువ పొలాల నీటి సమస్యను పరిష్కరించుకున్నారు. కంకిపాడు సెక్షన్ పరిధిలోని కొణతనపాడు–ప్రొద్దుటూరు గ్రామాల మీదుగా కాలువ ప్రవహిస్తుంది. ఈ కాలువ వెంబడి నీటిని నియంత్రించేందుకు, మళ్లించేందుకు డ్యాం ఏర్పాటుచేశారు. ఆ డ్యాం సుమారు 8 ఏళ్ల కిందట శిథిలమైంది. అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం ఎగువ వైపు ఉన్న సుమారు 100 ఎకరాల్లో సాగుకు నీటి సమస్య తలెత్తింది. దీంతో ఇక్కడి రైతులు ఒక్కటై డ్యాం వద్ద సరుగు బాదులు, ఇసుక బస్తాలను ఏర్పాటుచేసి ఎగువ ప్రాంత భూములకు నీరు అందేలా, నీటి మట్టం నిర్వహించుకునేందుకు అనువుగా చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ఎగువ భూములకు సాగునీరు సమృద్ధిగా అందుతుందని రైతులు చెబుతున్నారు.

శాకంబరీ దేవి అలంకరణలో అమ్మవారు


చిదానంద ఆశ్రమానికి ఆషాఢ సారెను తీసుకువస్తున్న భక్తులు


శాకంబరీ దేవిగా శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని అమ్మవార్లు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని శ్రీ వినుకొండ వెంకమ్మ, వెంకమ్మతల్లి, మహాలక్ష్మి అమ్మవార్లను రకరకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. భక్తులు అందించిన కూరగాయలను మాలలుగా చేసి దేవాలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు.


యనమలకుదురులో...

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.సంధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యువి.ప్రసాదరావు, ఆలయ అర్చకులు కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, భవానీ భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు.

శ్రీపార్వతీదేవి అమ్మవారికి ఆషాఢ సారె

యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. శ్రీ దుర్గా శివసాయి సేవా సమితి భక్త బృందం గ్రామంలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆషాఢ సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.


యనమలకుదురులో శాకంబరీ అలంకరణలో కనకదుర్గమ్మ


నున్నలో శ్రీకనకదుర్గమ్మ


శ్రీపార్వతీదేవికి ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మకు శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదముల పంపిణీ జరిగింది.

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీచిదానంద ఆశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీభువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యాన ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత గన్నవరం, బుద్ధవరం గ్రామాల భక్తులు ఆషాఢ సారె, గ్రామ పొంగళ్లతో ఆశ్రమానికి ప్రదర్శనగా తరలివచ్చారు. శ్రీభువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతిస్వామి నేతృత్వంలో అమ్మవారికి పూజలు చేశారు. నవ వరార్చన, శ్రీచక్ర పూజలు, హోమాలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా సంపర్క్ ప్రముఖ్ వెలుగంటి శివాజీ, భక్తులు గూడవల్లి నాగేశ్వరరావు, ప్రసాద్, భవాని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


చిన అవుటపల్లిలో అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల ఆస్పత్రి ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీకనక దుర్గమ్మకి భక్తులు విశేష అలంకరణలు చేసి పూజలు చేశారు. దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. ఆషాఢ మాస శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని సారె సమర్పించారు. ఆస్పత్రి, మెడికల్ కళాశాల యాజమాన్యం, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నున్నలో విద్యార్థులకు రక్త పరీక్షలు


విద్యార్థినికి రక్త పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎమ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్య సిబ్బంది శుక్రవారం రక్త (హిమోగ్లోబిన్) పరీక్షలు చేశారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని కనుగొనేందుకు హెచ్‌బీ టెస్ట్ చేస్తారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ అండ్ యాసిడ్ టాబ్లెట్స్‌ను ఇస్తారు. ప్రతి గురువారం విద్యార్థినులకు వీక్లి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను మింగిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విజయ తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, ఏఎన్ఎమ్ ఆర్.లక్ష్మి, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

రంగన్నగూడంలో ఉచిత వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో రక్తపోటు, మధుమేహం, గుండె, కీళ్లు, కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. 150 మందికి వైద్య సేవలు అందించారు. ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, డాక్టర్లు ఎం.ఎ.స మీరా, ఎస్.కార్తీక్, అభిషేక్, నిఖిల్, సుభాషిణి, గీతా పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన


యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ గణేష్‌కుమార్


హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉషారామ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఉంగుటూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యాన శుక్రవారం తేలప్రోలులో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ ధరించడం తమ వ్యక్తిగత భద్రతగా భావించాలని సూచించారు. హెల్మెట్ వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణరక్షణ లభిస్తోందని చెప్పారు. అనంతరం తేలప్రోలు నుంచి పొట్టిపాడు వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, ఎం.భాను పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ఉయ్యూరు: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఉయ్యూరు పట్టణ ఎస్ఐ గణేష్ కుమార్ అన్నారు. పట్టణంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. యువతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ గణేష్‌కుమార్ మాట్లాడుతూ మైనర్లు వాహనం నడపటం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. యువత ట్రిబుల్ రైడ్ చేయొద్దని, హెల్మెంట్ ధరించాలని సూచించారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


కానూరులో అమరవీరులకు నివాళులర్పిస్తున్న క్రీడాకారులు


పెనమలూరులో వృద్ధుల కోసం సేకరించిన దుస్తులు, నిత్యావసర సరుకులతో విద్యార్థులు

పెనమలూరు: మండల పరిధిలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. పెనమలూరు సెంటర్‌లోని గ్రీన్ పాఠశాల విద్యార్థులు వారి కిడ్డీ బ్యాంకు నుంచి దాచుకున్న సొమ్ముతో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కానూరులోని మధురలోగిలి వృద్ధుల ఆశ్రమంలో వస్త్రాలు, పండ్లు, పాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో విద్యార్థులు తమ దేశభక్తిని చాటారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయి అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు అశోక్ జిమ్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో అమర వీరులకు నివాళులర్పించారు. జిమ్ నిర్వాహకుడు, బాడీ బిల్డింగ్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ యువత దేశభక్తితో ఉండాలని సూచించారు. ఈదా రాజేష్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

30న మండల స్థాయి చెస్ పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో 30వ తేదీన మండల స్థాయిలో చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన బాలబాలికలు తమ చెస్ బోర్డులతో ఉదయం 9 గంటలలోపు హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 9490798909 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళల్లో నైపుణ్యాలు పెంచి వారికి ఉపాధి చూపేందుకు ఆగస్టు 1వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు ఈ శిక్షణలో పాల్గొనడానికి అర్హులన్నారు. ఆసక్తి గల వారు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డుతో ఆగస్టు 1వ తేదీలోగా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 0866–2470420 నంబరులో సంప్రదించాల్సిదిగా ఆమె కోరారు.

ఇంటి పన్నుల సర్వే పరిశీలన


తాడిగడపలో ఇంటి పన్ను సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో ఇంటి పన్నులు ఉన్నవారు వెంటనే చెల్లించాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సూచించారు. తాడిగడప, కానూరు ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటి పన్నుల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో లక్ష్యం చేరాలని, ఇంటి పన్నులు లేని వాటికి పన్ను విధించాలని అన్నారు. ఇంటి పన్నుల్లో హెచ్చుతగ్గులు ఉన్నా సరి చేస్తామన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్సన్

రామవరప్పాడు: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు సీబీసీఎన్‌సీ చర్చి వద్ద లేబర్ డేను పురస్కరించుకుని శుక్రవారం కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టే విధంగా తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ శారదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com